# పరిష్కారం

బి.ఏ. అనే రెండక్షరాల డిగ్రీ మూడేళ్ళనుండి గోడకు వేళ్లాడుతున్నా అనురాధ మెడ మాత్రం మూడు ముళ్లకు నోచుకోలేదు. అన్నట్టూ.... పెళ్లి చూపుల స్కోరు ముప్పై దాటిందప్పుడే.

సామన ఛాయతో నిగ నిగ లాడే అనూరాధకు చారెడేసి కళ్లున్నై. నల్లతాచును తలదన్నే బారెడంత జడ వీపుమీదాడుతుంటుంది. బుగ్గలమీంచి సిగ్గులు రాలిపోతుంటాయప్పుడప్పుడు. అంతా కలిసి పాతవాళ్ళకు ఆవరేజ్ ఆడపడుచుగా కనిపిస్తుంది. వయసు ప్రసాదించిన వంపు సొంపుల్తో కొత్త కళ్ళకు పెళ్ళీడు కొచ్చిన పిల్లలా కనబడుతుంది.

అంతెందుకూ... నిన్నంటే నిన్న పెళ్ళి చూపుల హీరోగా వచ్చిన రాజారావు మొదటి చూపుతో పెదాలు తడిపేసుకున్నాడు. ఒళ్ళంతా కళ్లు జేసు కుని అనూరాధను ఆపాదమస్తకం పరిశీలించాడు. పదోతరగతి ఫస్టుసిట్టింగ్‌లో ఫస్టు క్లాసుతో పాసైన విద్యార్థిలా వెలిగిపోయిందతని ముఖారవిందము.

శాస్త్రిగారు గుండెల నిండా ఊపిరి పీల్చుకుని "ఇహ ఈ సంబంధం అతికినట్టే" అనాలనుకున్నాడు. ఆ మరుక్షణమే– నామినేషన్ వేసేప్పుడున్న అభ్యర్థి సంతోషం పోలింగ్ ట్రెండ్ చూడ్డంతో ఊడ్చుకు పోయినట్టు డీలాపడి

పోయాడు. ఏతా వాతా కట్నం దగ్గర మడత పేచీ ముదిరి అంచనాలను వంచనకు గురిచేశాయి.

తల్లిదండ్రుల మోచేతి పొడుపుల్ని భరించలేక-పోలీసులు పట్టుకెల్తున్న నిర్దోషిలా నిష్క్రమిస్తున్న హీరో

"అమ్మాయి కుద్యోగమన్నా ఉంటే వీళ్ళందర్నీ ఎదిరించి పెళ్లాడే వాణ్ని" గొణిగాడు.

ఏ సుముహూర్తంలో రాజారావలా గొణిగాడో గానీ మర్నాడే అనూ రాధకు మొదటి ఇంటర్వ్యూ కాల్ లెటరొచ్చింది. మనసు ఆనంద డోలిక లూగింది.

....ఇంటర్వ్యూలో చక్కగా జవాబులు చెప్పి జాబ్ కొట్టెయ్యాలి. ఎవరి ముందు తలవంచకుండా సర్వతంత్ర స్వతంత్రురాలిగా జీవితాన్ని నందన వనంగా మార్చుకోవాలి. తల్లిదండ్రులకు గుది బండలా కాకుండా బంగారు గుమ్మడికాయలా కన్పించాలి.

ఊహలు హిమాలయాలను తాకాయి.

సభ్య సమాజమనే మండు టెండలో ఉద్యోగం చల్లని నీడ లాంటిది. ఆ నీడలో తోడుగా నిల్చుండేందుకు ఏ మొనగాడైనా ముందుకొస్తాడు. వలచిన వన్నెకాడి దోసిట్లో వలపులన్నీ కుమ్మరించి, అతని గుండెల మీద హాయిగా ఒరిగి పోవచ్చు. బ్రతుకు బాటలో వసంతం ప్రవేశించడం ఖాయం.

ఆలోచిస్తూనే ఇంటర్వ్యూ హాల్లో అడుగు పెట్టింది.

పేరూ, ఊరూ అడిగి సర్టిఫికేట్స్ చూసి వెళ్లిపొమ్మన్నారు.

"ఇంటర్వ్యూ అంటే ఇంతేనా? ఇలాగైతే ప్రతిభనెలా పరీక్షించినట్టూ!" అనుకుంటూ పంక్చరైన బెలూన్‌లా ఇంటికొచ్చింది.

"ఇలా ఇంటర్వ్యూ కెళ్లి అలా ఉద్యోగం రమ్మంటే రాదు. దానికి ఉత్తరమో, దక్షిణమో ఉండి తీరా"లన్న నగ్న సత్యం చెప్పించారు, కళ్ళు తెరిపించారు స్నేహితురాళ్లు.

" మొదటి ఇంటర్వ్యూకే మొహం మాడిపోయిన అప్పుడమైంది. నా మాట విని ఉద్యోగ ప్రయత్నం మానెయ్. కల్యాణ ఘడియ రావాలేగానీ నీ కోసం పడి చచ్చేవాడెవడో రాకమానడు. నీ మెడలో మూడు ముళ్లెయ్యక మానడు. దేనికైనా సమయం రావాలి మరి! " తల్లి రాగాలు తీసింది.

ఐనా.... అడుక్కు తినేవాడు గూడా ఏనాటికైనా ఐశ్వర్యవంతుడు కావాలనుకున్నట్టు - అనూరాధ ఆశ చావలేదు. ఉద్యోగం దొరికేదాకా పెళ్లి జోలికి పోవద్దనే నిర్ణయం ధైర్య మిచ్చింది.

కర్మణ్యేవాధికారస్తే....గీతా శ్లోకం గుర్తుకొచ్చి ఇంటర్వ్యూ లన్నింటికీ వెళ్లొస్తుంది.

అదే పరంపరలో మరో కాల్ లెటరొచ్చింది. పేరున్న ప్రైవేట్ కంపెనీలో గుమాస్తా ఉద్యోగం. ఏ పుట్టలో ఏ పాముందో.... తప్పకుండా వెళ్ళాలి.

ఎందుకైనా మంచిదని ఇంటర్వ్యూకు అరగంట ముందే చేరుకుంది, మౌఢ్యమి రోజుల్లో వెల వెల బోతున్న కల్యాణ మంటపం లాగుంది ఆఫీసు. వాచ్‌మెన్ తప్ప ఎవ్వరూ లేరక్కడ. ఆఫీసు గడియారం తొమ్మిదిన్నర చూపుతుంది. ఇంకో అరగంటైతే ఇంటర్వ్యూ ప్రారంభమౌతుంది.

ఇంతకీ ఈ ఇంటర్వ్యూ ఉద్యోగం ఎవరి ప్రాప్తమో! ఉద్యోగ మెవరి కివ్వాలో నిర్ణయమైం తర్వాతే ప్రభుత్వ నిబంధనోల్లంఘన అనే పాప పరిహారార్థం మాత్రమే ఇంటర్వ్యూలౌతాయట. ఇదేం భాగోతమో మరి....

"అనూరాధ గారూ!"

ఈ లోకంలో కొచ్చి పడింది. ఎదురుగా ఓ యువకుడు. చిరు నవ్వులు సింగారించుకుని తన వైపే చూస్తున్నాడు. అనూరాధ కళ్లు అలవోకగా కదిలాయి.

ఇతడు అతడే కదూ! ఎవ్వరినైనా ఆకర్షించగల స్ఫుర ద్రూపం.... ఆ నుదురూ, ఆ చొరవా ....కానీ....

"ఏమండోయ్! నేనండీ చక్రధర్‌ను."

ఔను, అతడే! అతని పోస్టు గ్రాడ్యుయేషనూ, తన డిగ్రీ ఒకే కళాశాలలో ఒకేసారి పూర్తయిపోయినై. వార్షికోత్సవాల్లో, విహార యాత్రల్లో నాటకాల్లో ఎన్నో సార్లు కలుసుకున్నారు.

"అరె.... ఏమిటండీ మీ పరధ్యానం! మీరు అనూరాధగారేనా?"

" సారీ చక్రధర్ గారూ! చాలా రోజుల తర్వాత కలిశాం గదూ .... " సర్దుకు మాట్లాడుతున్న అనూరాధ పలు వరుస తళుక్కున మెరిసింది.

"అద్సరే... మీరు గూడా ఇంటర్వ్యూ కొచ్చారా?"

చక్రధర్ మాట్లాడ్తుంటే అందమైన మీసం కట్టు అలవోకగా కదుల్తుంది.

"ఔను... రాకూడదా?"

"అబ్బే....రాకూడదని కాదు. కాని మీకింకా...." మాటలు గొంతులో ఇరుక్కుపోతున్నాయి.

"...పెళ్ళి కాలేదు...!"

"అద్సరే... ఉద్యోగం..."

"అదీ దొరకలేదు. మీరుగూడా...!"

"ఔనూ నేనూ డిటో"

ఇద్దరి పెదాలు వణికాయొకేసారి.

సరిగ్గా పెళ్లిముహూర్తానికే చుట్టాలు దిగినట్టు పది గంటలకు ఆఫీసులో సందడి. పది నిమిషాల్లో చాలా మంది వచ్చేశారు.

ఆలస్యాన్ని తు. చ. తప్పకుండా పాటిస్తున్న మంత్రి వర్యుడిలా - రావాల్సిన కారు పదిన్నరకొచ్చింది.

ఒకే ఒక్క వేకెన్సీకి పదిమంది పోటీ.

ముహూర్తం దాటాకా మూడుముళ్లు పడినట్టు-ఇంటర్వ్యూ పదకొండుకు ప్రారంభమైంది.

నామినేషను పత్రాలను నాలుగు కోణాల్లోంచి పరీక్షిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్లా చక్రధర్ సర్టిఫికెట్లను తిరగేసి మరగేసి చూచి

"గూడ్! ఉద్యోగమే చెయ్యాలని ఎందు కనుకుంటున్నారూ?" ప్రశ్నా బాణం విసిరాడు ప్రొప్రైటర్.

అది వాడి చాకులా తగిలింది చక్రధర్‌కు.

"ఉద్యోగం పురుష లక్షణం గదండీ!"

ఇంటర్వ్యూ పెద్దలకు షాక్ తగిలింది.

" అది కాదూ! ఏదన్నా వ్యాపారం చేసుకోవచ్చు గదా !" యం. డి. సవరించాడు.

"దాని పెట్టుబడికి నా ఎమ్మే డిగ్రీ పనికి రాదండీ!"

" చదువుకున్న నిరుద్యోగులకు బ్యాంకులు అప్పులిస్తున్నాయిగదా! " కళ్ళజోడు పైనుంచి చూస్తూ అడిగాడు మానేజర్.

" అప్పులా! అవి ఎప్పుడు, ఎలా, ఎవరి కిస్తున్నారో... దానిగ్గూడా పెట్టుబడి కావాలనేది జగమెరిగిన సత్యమండీ! ఐనా... అప్పుకు అప్లై చేసి, సాంక్షనై నాచేతికి వచ్చేసరికి నామీద ఆధారపడిన మా అమ్మా, తమ్ముడూ, చెల్లీ ఆకలి మంటలతో అల్లాడి పోతారండీ!"

చక్రధర్ ధైర్యం ప్రొప్రైటర్‌ను కదిలించింది.

"మీకింకా పెళ్లి కాలేదన్నమాటా!"

"ఉన్నమాటేనండీ, నాకే ఓదారి లేదంటే మెడలో ఓ డోలెందుకండీ?"

" పెళ్లైతే కట్నమొస్తుంది. " మానేజరందున్నాడు " కట్నం డబ్బు పెట్టుబడితో ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చు. మరి కొందరు నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వవచ్చు..."

"కట్నానికి కక్కుర్తి పడేది మనిషి జన్మ కాదని నా విశ్వాసమండీ!"

చక్రధర్ తర్వాత మరో ఇద్దరు.

చివరగా అనూరాధ తలొంచుకొని కూచుంది.

"మీ అనుభవం...?"సూటిగా ప్రశ్నించాడు ప్రొప్రైటర్, సర్టిఫికెట్లను తిరిగేస్తూ.

అనూరాధ తల స్ప్రింగ్‌లా లేచింది.

ప్రొప్రైటర్ మొహంలో మరే భావమూ కన్పించలేదు.

తమాయించుకుంది.

"బోలెడన్నిసార్లు పెళ్లిచూపులకు తయారై కూచోడం, తలా తోకా లేని ప్రశ్నలకు తలవంచుకు సమాధానాలివ్వడం!"

ఇంటర్వ్యూ దేవతల పెదాల మీద చిరునవ్వులు మెరిశాయి.

"ఉద్యోగ మెందుకు చెయ్యాలనుకుంటున్నారు?" యం.డి. ప్రశ్న.

"ఎందుకు బ్రతకాలనుకుంటున్నారు? " అని ప్రశ్నిస్తే బావుండేదేమో-అనుకుని అనూరాధ అంతరంగం కుత కుత లాడింది. ఇంటర్వ్యూ ప్రశ్నలు వ్యర్థమైనవైనా సమర్థవంతమైన జవాబు లివ్వడం అభ్యర్థికే క్షేమకరమని గుర్తొచ్చింది. కాస్సేపు తటపటాయించి

" పెళ్లి కోసం! " అంది.

" పెళ్ళి కోసమా!?" కోరస్.

ఒకే తోపుకు తెరుచుకున్న రెండు తలుపుల్లా మానేజర్, యం.డి. ల నోర్లు అమాంతం తెరుచుకున్నాయి.

"ఔనండీ! ఆడ పిల్లకు పెళ్ళి కావాలంటే కట్నం కావాలట. అది లేదు కాబట్టే నేనింకా పెళ్లి కూతుర్ని కాలేదు.

" ఐతే! "

"ఉద్యోగమనే పీట ఆసరాగా నా కాళ్ళమీద నేను నిల్చోవాలనీ..."

"కట్నం కోసం ఉద్యోగం చేసి డబ్బు కూడబెట్టుకుంటారా?"

"నెవ్వర్. కట్నాని కమ్ముడుబోయే కసాయిని నా భర్తగా ఎన్నడూ ఊహించలేను" అనూరాధ ముక్కుపుటా లెగిరి పడుతున్నై - గాలికి కదిలే రెమ్మల్లా.

"మరి పెళ్లెలాగౌతుదమ్మా?" ప్రొప్రైటర్ భృకుటి ముడి పడింది.

"నేను ఉద్యోగం చేస్తూ సంపాదన లేని యువకుణ్ని కట్నం లేకుండా పెళ్లాడ్తా."

"సంపాదన ఉన్నవారు కట్నం లేకుండా పెళ్లాడ్తామంటే...."

"అలాంటి వారుండరు, అది అసంభవం"

"మీరన్నట్టు ఎవరూ ముందుకు రాకపోతే!"

"ఇలాగే ఉండిపోతా!" అనూరాధ కళ్ళల్లో ఆత్మస్థయిర్యం మెరిసింది.

ఇంటర్వ్యూ దేవతలు ప్రసన్న వదనులయారు.

ఇంటర్వ్యూ ముగిసింది.

ఫలితాల కోసం ఎదిరి చూస్తున్నారంతా. ఒక్కో నిముషం భారీ ఇంజన్లు మోసుకెల్తున్న ఎడ్లబండిలా భారంగా గడుస్తుంది.

మానేజర్ బయటికొచ్చాడు. చుట్టుముట్టారంతా.

"చక్రధర్ - అనూరాధ గారలు ఫైనల్ సెలక్షన్‌కు రేపిదే సమయానికి తమ తలిదండ్రులతో సహా ఇక్కడికే రావాలి."

ప్రకటన వినిపించాడు.

అనూరాధ తండ్రితో, చక్రధర్ తల్లితో హాజరయారు ఫైనల్ సెలక్షన్‌కు. పెద్దవారినెందుకు రమ్మన్నారో అర్థం కాలేదెవరికీ. సస్పెన్స్ సినిమా ప్రేక్షకుల్లా ఊపిరి బిగపట్టి కూచున్నారు.

అరచేతులంత కళ్ళను చక్రధర్ వైపు తిప్పి

"ఫైనల్ సెలక్షన్‌కు పెద్దలెందుకో!" అంది.

"ఉద్యోగమిచ్చే ముందు గ్యారంటీ ఏమైనా తీసుకుంటారేమో!" అన్నాడు చక్రధర్-యక్షుని చిక్కు ప్రశ్నకు చక్కని సమాధాన మిచ్చిన ధర్మరాజులా.

"మరైతే ఒకే వెకెన్సీకి ఇద్దరెందుకూ?" అద్దం లాంటి చెక్కిళ్లకు అందమైన చెయ్యి అంటుకుపోయింది.

బుర్ర గోక్కున్నాడు చక్రధర్.

" ఎరక్కపోయి ఏదో చెబితే.... మరో సమస్య ముందు కొచ్చిందే " అనుకుంటున్నాడు. ఏమూల నుంచో తోసుకొచ్చిన నవ్వును పెదాల బిగించి ఆపుకుంటుంది అనూరాధ.

కారు దూసుకొచ్చిందప్పుడే.

"మీరంతా కారెక్కండి!" మానేజర్ ఆజ్ఞలో మర్యాద తొంగిచూచింది.

"ఎందుకూ?" ఆందోళనగా అడిగాడు అనూరాధ తండ్రి,

"ప్లీజ్ సార్! ముందు మీరు కారెక్కండి!"

"ఫైనల్ సెలెక్షనెక్కడా?"

గుండె గుబ గుబల్ని గొంతులో అదిమి పట్టుకుంది అనూరాధ.

"ప్రొప్రైటర్ గారింట్లో."

మూడంతస్తుల భవనం ముందు కారాగింది. పులి గుహలోకి మేకల్లా లోపలికెళ్లి కూచున్నారంతా. దిక్కులు చూస్తున్నారు,

ప్రొప్రైటర్, అతని వెంట మరికొందరొచ్చారక్కడికి. వచ్చినవారంతా హుషారుగా ఉన్నారు.

"ఈమె నాభార్య పార్వతి, వీడు నా కొడుకు రవీందర్, ఈమె నా కూతురు పద్మావతి" తన కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశాడు ప్రొప్రైటర్.

వేడి కాఫీ లొచ్చాయి.

"ఫైనల్ సెలెక్షనెప్పుడండీ?"

కాఫీ సేవిస్తున్న చక్రధర్ గొంతు చిన్నగా వణికింది.

మానేజర్, ప్రొప్రైటర్ కళ్ళతో మాట్లాడుకున్నారు.

"ఇదే నండీ ఫైనల్ సెలెక్షన్!" నవ్వేశాడు మానేజర్ పగిలిన షోడా బుడ్డిలా, విడుదలైన వారం రోజుల్లో తిరిగొచ్చిన కొత్త సినిమా డబ్బాల్లా ప్లాపైందా నవ్వు.

"అదెలా?" అంది అనూరాధ – తేరుకుంటూ.

" ఎలాగంటే .... అనూరాధను మా అబ్బాయి రవీందర్ జీవిత భాగ స్వామిగా, చక్రధర్‌కు మా అమ్మాయి పద్మావతి నిచ్చి నా వ్యాపారాల్లో భాగస్వామిగా స్వీకరించాలని మా ఆలోచన. .... అందుకు మా అమ్మాయి, అబ్బాయిలు మనఃపూర్వకముగా అంగీకరించారు. ఇక మిగిలింది మీ నిర్ణయమే. ఇందులో బలవంత మేమీ లేదు. కట్నం ప్రసక్తి రావొద్దు" అని

అందరి మొహాల్లోకి చూచాడు. ప్రొప్రైటర్.

ఇది కలా నిజమా అని తేల్చుకోలేక ఉక్కిరి బిక్కిరై పోయింది అనూరాధ. తలెత్తి రవీందర్ కళ్ళలోకి చూచింది. అతని చూపులప్పటికే ఆవిడ ఒళ్ళంతా తడిమేశాయి. పద్మావతి క్రీగంటిచూపుల్లో కరిగిపోతున్న చక్రధర్ కేం మాట్లాడాలో తోచలేదు.

"ఎవరూ మాట్లాడరేం ?" మానేజర్ గొంతు సవరించుకుని "మా ప్రొప్రైటర్‌గారి అభ్యుదయ భావాలు చేతల్లో ఉంటాయి. మాటల్లో కాదు. ఇంటర్వ్యూ పేర మిమ్ముల్ని వలవేసి పట్టుకున్నారు. ఆ తర్వాత మీ ఇష్టం" అన్నాడు.

ఆనందం అర్ణవమైన వేళ అనూరాధ మేను పులకింతలకు లోనైంది. ఎరుపెక్కిన చెక్కిళ్లు సిగ్గులు సింగారించుకున్నాయి.

"ఇది మా అదృష్టం బాబూ!" అనూరాధ తండ్రి మురిసిపోయాడు.

కాలి నడకన తిరుపతి కొండెక్కినంత సంతోషమైంది చక్రధర్‌కు. తల్లివైపు చూస్తుంటే ముసి ముసి నవ్వు లాగలేదు.

"ఆ భగవంతుడే ప్రత్యక్షమై వరమిస్తానంటే కాదనే మూర్ఖులం కాదు!" అంటూంటే ఆమె మొహం గంపెడంతైంది.

" చిక్కని సమస్యకు చక్కని సమాధానం. శుభం " సినిమాటిక్ గా చేతులు తిప్పేశాడు మానేజర్.

నవ్వుల పువ్వుల జల్లు కురిసింది.

(ఆకాశవాణి హైదరాబాదు "సి" కేంద్రము 18-6-92)